TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 362 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.29.07.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## హైడ్రా కొనసాగుతుంది.. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం

### కేంద్రం పెత్తనంతోనే పరీక్షల్లో అవకతవకలు

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ విమర్శలకు కౌంటర్

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: తమ ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత కీలక సంస్కరణల్లో హైడ్రా ఒకటని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులను ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు సంబంధించిన అంశంపై వచ్చిన తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామని తెలిపారు. హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించిన ముఖ్యమంత్రి, కొందరు డబ్బులు వెచ్చించి మరీ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలను ఇంకా పూర్తిగా పరిశీలించలేదని, అయినప్పటికీ హైడ్రా కార్యకలాపాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇక మరోవైపు రాష్ట్ర విద్యా వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వ జోక్యం పెరగడం వల్లే పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర యూనివర్సిటీలు, పరీక్షల నిర్వహణపై కేంద్రం పెత్తనం చెలాయించడం తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై బీజేపీ విమర్శలకు స్పందించిన రేవంత్ రెడ్డి.. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని అన్నారు. ఏపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముందుగా అక్కడ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించాలని కోరాలని సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో




ఉన్న ఏపీలో సమస్యను పరిష్కరించిన తర్వాతే తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించాలని వ్యాఖ్యానించారు.

## కామన్వెల్త్‌లో రజతం - వెయిట్ లిఫ్టర్

### అజయ్‌బాబుకు సీఎం, డిప్యూటీ సీఎం అభినందనలు

అమరావతి, అమృత్ తెలంగాణ: గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం సాధించిన వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వ మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయన పట్టుదల, క్రీడా వారసత్వం , విజయనగరం జిల్లాకు తెచ్చిన కీర్తిని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం సాధించి, భారతదేశానికి మరో ఘనమైన కీర్తిని చేకూర్చారని ప్రశంసించారు. అజయ్ సాధించిన విజయానికి దేశం మొత్తం నంబరాలు చేసుకుంటోందని, అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో అజయ్ ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రపంచ వేదికపై మరిన్ని గొప్ప విజయాలు సాధించడానికి ఇది తొలి అడుగుగా అభివర్ణించారు.

అభినందించిన ముఖ్యమంత్రి : వెయిట్ లిఫ్టర్ అజయ్ బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. గ్లాస్గో 2026 కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో వల్లూరి అజయ్ బాబు రజత పతకం సాధించారన్నారు. తన తండ్రి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ అజయ్ క్రీడా వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించారని ప్రశంసించారు. అజయ్ సాధించిన ఈ విజయం ఏపీతో పాటు యావత్ భారతదేశానికే గర్వకారణమన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ క్రీడా కీర్తిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

గ్లోబల్ స్టేజ్పై భారత బిడ్డ: ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన అజయ్, తన తండ్రి కామన్వెల్త్



గేమ్స్ మెడలిస్ట్ అయిన వల్లూరి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ అద్భుతమైన క్రీడా వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లారని అన్నారు. అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల, శ్రేష్ఠత వైపు సాగిన ఆయన స్ఫూర్తిదాయకమైన ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చాలా స్వల్ప తేడాతో బంగారు పతకాన్ని కోల్పోయినప్పటికీ, ఈ అసాధారణ ప్రదర్శన ఒక నిజమైన ఛాంపియన్‌కు ఉండాల్సిన ధైర్యం, స్థితిస్థాపకత, పట్టుదలను ప్రతిబింబిస్తోందని అజయ్‌ను పవన్ కల్యాణ్ కొనియాడారు.

ఈ ఘనవిజయాన్ని దేశమంతా సంబరంగా జరుపుకుంటుంటే, భరతమాత కీర్తిని గ్లోబల్ స్టేజ్పై నిలిపిన తన ముద్దుల బిడ్డను చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో గర్విస్తోందని అన్నారు. ఈ అద్భుత విజయం అంతర్జాతీయ వేదికలపై అజయ్‌బాబు సాధించబోయే మరెన్నో గొప్ప విజయాలకు తొలి అడుగు కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో అజయ్‌బాబు ఇలాంటి మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పవన్ కల్యాణ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

అభినందనలు తెలిపిన మంత్రులు: అల్లూరి అజయ్‌బాబు, అతని తండ్రి శ్రీనివాసరావును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్‌లో 79 కేజీల విభాగంలో రజత పతకం సాధించిన అజయ్‌బాబు తండ్రి శ్రీనివాసరావును క్యాంప్ కార్యాలయానికి పిలిపించి సన్మానించారు. అనంతరం అజయ్‌బాబుతో వీడియో కాల్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు. దేశానికి గర్వకారణంగా నిలిచినందుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు.

కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం సాధించిన వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబుకు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందనలు తెలిపారు. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో దేశానికి కీర్తి తీసుకురావడంతో పాటు రజత పతకం సాధించడం అజయ్ బాబు ప్రతిభకు నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారుడు అంతర్జాతీయ వేదికపై సత్తా చాటడం రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం, ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత గౌరవం తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు.

## ఉత్తరాంధ్ర ప్రగతికి 'గ్రోత్ ఇంజిన్' -ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న భోగాపురం విమానాశ్రయం


### ఆగస్టు ఒకటో తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం - కేవలం 31 నెలల్లోనే పూర్తైన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణం - మౌలిక వసతులు, భూసేకరణ కోసం రూ.1,582.97 కోట్లు

అమరావతి, అమృత్ తెలంగాణ: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారమవుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ఆగస్టు ఒకటో తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' జాతికి అంకితం కానుంది. దేశంలోనే అత్యంత వేగంగా రికార్డు స్థాయిలో కేవలం 31 నెలల్లోనే ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణాన్ని పూర్తి చేసి కూటమి ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించింది. ఉత్తరాంధ్ర ప్రగతికి ఈ విమానాశ్రయం సరికొత్త గ్రోత్ ఇంజిన్‌గా మారనుంది.

చరిత్రాత్మక ఘట్టం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ప్రభుత్వాల హయాంలో ఆలస్యమైన ఈ ప్రాజెక్టును 2024లో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకశ్రద్ధతో పరుగులు పెట్టించారు. మొదట నిర్ణయించిన గడువు కంటే దాదాపు 5 నెలల ముందే పనులు పూర్తి చేసి రికార్డు సమయంలో వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధం చేయడం విశేషం. ఈ అద్భుత మైలురాయిని జరుపుకునేందుకు వీలుగా ప్రధానమంత్రి పర్యటన కోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చే ఈ చరిత్రాత్మక ఘట్టం కోసం యావత్ రాష్ట్రం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

ఈ విమానాశ్రయ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన భాగస్వామ్య పాత్ర పోషించింది. మౌలిక వసతుల కల్పన, భూసేకరణ కోసం 15వందల 82 కోట్ల 97 లక్షల రూపాయలను స్వయంగా వెచ్చించింది. ఇందులో భూసేకరణకే అత్యధికంగా 944.40 కోట్లు కేటాయించగా అప్రోచ్ రోడ్లు, కనెక్టివిటీ రహదారుల కోసం మరో 300 కోట్లకు పైగా ఖర్చు చేశారు. విద్యుత్ సరఫరా కోసం 97 కోట్లు, తాగునీటి ప్రాజెక్టుల కోసం 75 కోట్లు కేటాయించి పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయించారు. ప్రభుత్వ పట్టుదల, అధికారుల నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ భారీ ప్రాజెక్టు ఇంత వేగంగా సాకారమైంది.

ఎన్నో ప్రత్యేకతలు: భోగాపురం విమానాశ్రయం కేవలం ఒక ప్రయాణ కేంద్రంగానే



కాకుండా ఉత్తరాంధ్ర సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తోంది. బంగాళాఖాతం సముద్ర తీర అందాలను తలపించేలా 'ఫ్లయింగ్ ఫిష్' నమూనాలో ఈ టెర్మినల్ భవనాన్ని అత్యంత అద్భుతంగా డిజైన్ చేశారు. టెర్మినల్ పైకప్పు, సీలింగ్ డిజైన్లలో ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ కళా పద్ధతులను అద్భుతంగా మేళవించారు. ఆధునిక ఆర్కిటెక్చర్‌తో పాటు స్థానిక సాంస్కృతిక వారసత్వాన్ని అంతర్జాతీయ ప్రయాణికులకు పరిచయం చేసేలాదీనికి రూపకల్పన చేశారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని చాటేలా ఆయన విగ్రహాన్ని, ప్రతిరూపాన్ని ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవ వేళ విమానాశ్రయ నిర్మాణం కోసం తమ భూములను త్యాగం చేసిన స్థానిక రైతులకు ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని కల్పిస్తోంది. భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరే తొలి విమానంలో ప్రయాణించే సువర్ణ అవకాశాన్ని భూనిర్వాసిత రైతులకు ఉచితంగా కల్పిస్తున్నారు. పారిశ్రామిక ప్రగతితో పాటు రైతుల త్యాగాలను గౌరవించాలనే సీఎం చంద్రబాబు ఆలోచనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. డీజీసీఏ లైసెన్స్, బీసీఏఎస్ సెక్యూరిటీ క్లియరెన్స్ వంటి అన్ని రకాల అనుమతులు రావడంతో ఆగస్టు 1న ఈ కలల ప్రాజెక్టు అధికారికంగా ప్రారంభంకానుంది.

## అంగన్వాడీల పేరుతో విషప్రచారం.. వైసీపీపై మంత్రి లోకేశ్ ఫైర్

అమరావతి,అమృత్ తెలంగాణ: అంగన్వాడీల విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీలకు అమ్మఒడి పథకం అందలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం అమలు చేసిందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు మద్దతుగా అంగన్వాడీలు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని వైసీపీ నేతలు కావాలనే నిరసన కార్యక్రమంగా చూపుతున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 'ఫేక్ వర్సెస్ రియల్' పేరుతో వీడియోను విడుదల చేశారు. అంగన్వాడీల పేరుతో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను



కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ అన్యాయం చేసిందని మంత్రి మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయడంతో సంతోషంతో వారు నా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేసిన గొడ్డలి పార్టీ.. అంగన్వాడీల ఈ కృతజ్ఞత ర్యాలీని, నిరసన ర్యాలీ అంటూ విష ప్రచారం చేస్తోంది' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు

## కాక్రోచ్ జనతా పార్టీలో చీలిక.. మొహమ్మద్ జునైద్ సీజేపీని వీడబోతున్నారా

న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీలో చీలిక వచ్చిందని, కీలక నేతల మధ్య విబేధాలు చోటుచేసుకున్నాయని ఒక ప్రచారం మొదలైంది. అయితే, ఈ ప్రచారంపై సీజేపీ కీలక నేత, వాలంటీర్ మొహమ్మద్ జునైద్ స్పందించారు. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, పార్టీలో చీలిక లేదని వెల్లడించారు. నేతలమధ్య ఎలాంటి విబేధాలు లేవన్నారు. మొహమ్మద్ జునైద్ సీజేపీలో కీలక వాలంటీర్‌గా ఉన్నారు.

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా జునైద్ కమ్యూనిటీ కిచెన్ నిర్వహణ బాధ్యతలు చూసుకున్నారు. నిరసనల్లో పాల్గొన్నవారికి ఆహారం అందించాడు. సీజేపీకి మద్దతుగా భారీ ప్రచారం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్నారు. దీంతో అతడికి మంచి గుర్తింపు దక్కింది. కానీ, ఇటీవల అతడికి సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కేతోపాటు పార్టీలోని ఇతర నేతలతో అతడికి విబేధాలు చోటు చేసుకున్నాయని, ఈ నేపథ్యంలో జునైద్ సీజేపీని వీడుతారనే ప్రచారం మొదలైంది. ఇదే సమయంలో ఒక వీడియో కూడా గతంలో వైరల్ అవుతోంది. సీజేపీ తన నిరసన విరమించే ముందు తనను సంప్రదించలేదని వీడియోలో జునైద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జునైద్ పార్టీని వీడుతారని, పార్టీలో చీలిక అంటూ ప్రచారం ఊపందుకుంది.



ఈ ప్రచారంపై జునైద్ స్పందించాడు. ఈ ప్రచారంలో ఎంతమాత్రం నిజం లేదన్నాడు. తాను సీజేపీని వీడటం లేదన్నాడు. తనను సీజేపీ నేతలు సమర్థిస్తున్నారని, వారి మద్దతు తనకు ఉందని వెల్లడించారు. తమ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కొందరు ఇలా దుష్ప్రచారం చేస్తున్నానరిన జునైద్ మండిపడ్డాడు. తమ పార్టీని దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర చేస్తున్నారని జునైద్ ఆరోపించాడు.


## జంతర్ మంతర్ వద్ద మరో ధర్నా.. ఈసారి రిటైర్డ్ పోలీసుల వంతు! ఎందుకంటే?

అమృత్ తెలంగాణ: ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) విద్యార్థి విభాగాల ఆందోళనలతో దద్దరిల్లిన ఢిల్లీలోని జంతర్ మంతర్, ఇప్పుడుమరోఅసాధారణ నిరసనకు వేదికగా మారనుంది. విధినిర్వహణలోగాయపడిన పోలీసులకు సంఘీభావం ప్రకటిస్తూ రిటైర్డ్ పోలీస్ అధికారులు ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, జూలై 31న ఒకరోజు పాటు శాంతియుత నిరసన చేపట్టేందుకు అనుమతి కోరుతూ ఢిల్లీ పోలీస్ ఫెడరేషన్, పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్‌కు లేఖ రాసింది. జూలై 20న సీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' ర్యాలీ సందర్భంగా జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో సుమారు 100 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ సిబ్బంది గాయపడ్డారని ఫెడరేషన్ తమ దరఖాస్తులో పేర్కొంది.



శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల త్యాగాలను చాటిచెప్పేందుకే ఈ ధర్నా తలపెట్టినట్లు స్పష్టం చేసింది. జూలై 27న పోలీస్ ప్రధాన కార్యాలయంలో అందిన ఈ దరఖాస్తులో, జూలై 31న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన చేపట్టాలని ప్రతిపాదించారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




ప్రెస్ కాన్ఫెరెన్సులో వ్యవసాయ శాఖ మంత్రి



జిల్లా కలెక్టర్ తో పాటు హాజరైన అధికారులు



ఉత్తమ సేవలు అందజేసిన రైతులకు వ్యవసాయ శాఖ అధికారులకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్ జిల్లా జులై 28 అమృత్ తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసి, రైతులకు లాభదాయకంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని జిల్లాల మండల కేంద్రాల్లోని రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు. 'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా ప్రపంచ స్థాయి వ్యవసాయ సాంకేతికత, శాస్త్రీయ సూచనలను రైతులకు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంట మార్పిడి ద్వారా విజయాలు సాధించిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు. సోన్ మండల రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు 'రైతు నేస్తం' కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ సంతోష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# కోరుట్ల వైద్య సేవల బలోపేతానికి కృషి

## మంత్రి దామోదర రాజనర్సింహకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల వినతి



కోరుట్ల అమృత్ తెలంగాణ జూలై 28 : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి వైద్య--ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి సంబంధించిన 19 కీలక వినతిపత్రాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా చర్చించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యులను బదిలీ చేయకుండా కొనసాగించాలని, ఇప్పటికే వైద్యుల కొరత కారణంగా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఖాళీ పోస్టులను కొత్త నియామకాలతో భర్తీ చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అలాగే కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను అత్యవసరంగా మంజూరు చేయాలని కోరారు. కోరుట్ల ఆసుపత్రికి ఈ ఎన్ టి, ఐసియు, ఎస్ఎన్సీయూ ఆపరేషన్ థియేటర్, ఆర్థోపెడిక్, సర్జికల్ పరికరాలు, మెట్‌పల్లి ఆసుపత్రికి ఓటి హైడ్రాలిక్ టేబుల్స్, ఓటి ల్యాంపులు, ఆక్సిజన్ జనరేటర్, 60 కెవి జనరేటర్ తదితర పరికరాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మెట్‌పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో ఖాళీగా ఉన్న వైద్యులు, స్పెషలిస్టులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్, సాంకేతిక, పరిపాలనా సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కోరుట్ల ఆసుపత్రిలో పారిశుద్ధ్య సిబ్బందిని 34 నుంచి 55 మందికి, మెట్‌పల్లి ఆసుపత్రిలో 31 నుంచి 54 మందికి పెంచాలని ప్రతిపాదించారు. అదేవిధంగా కోరుట్ల 100 పడకల ఏరియా ఆసుపత్రికి అవసరమైన క్యాడర్ స్ట్రెంగ్త్ పెంచాలని, మెట్‌పల్లి 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి అదనపు వైద్య, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందిని మంజూరు చేయాలని కోరారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక అంబులెన్స్ మంజూరు చేయడం, నూతన ఆసుపత్రి భవనం ప్రారంభానికి ముందే సిబ్బంది, బెడ్లు, వైద్య పరికరాలు, ల్యాబ్ సౌకర్యాలు, మందులు, ఫర్నిచర్ వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ పైప్‌లైన్, రెండు బోర్‌వెల్లు, నియోజకవర్గంలోని 17 ఆరోగ్య ఉపకేంద్ర భవనాల పూర్తి కోసం అదనపు నిధులు మంజూరు చేయాలని కోరారు. కోరుట్ల మండలం మాధాపూర్‌లో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఐలాపూర్ పీహెచ్‌సీపై అధిక భారం పడుతున్నందున మాధాపూర్‌లో కొత్త పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రజలు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ కోరుట్ల నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల తెలిపారు. సమావేశంలో రాష్ట్ర వైద్య--ఆరోగ్య శాఖ అధికారులు, జగిత్యాల జిల్లా వైద్య--ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నీరు పేదలకే ఇందిరమ్మ ఇండ్లు

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## భూగర్భ జలాల సంరక్షణకు విస్తృతంగా ఫామ్ పాండ్ లు నిర్మించుకోవాలి

## కౌట్ల (కె) గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా



ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్న కలెక్టర్ బవేష్ మిశ్రా



కౌట్ల గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్ జిల్లా జులై 28 అమృత్ తెలంగాణ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ గ్రామీణ మండలం కౌట్ల (కె) గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లబ్ధిదారు మూడ నాగవ్వ కు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. లబ్ధిదారురాలు, అధికారులతో కలిసి రిబ్బను కత్తిరించి గృహ ప్రవేశం చేశారు. అనంతరం ఇంటిని మొత్తాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు అందిన డబ్బుల వివరాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇంటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. హౌస్ సర్వేను పరిశీలించారు. అంతకుముందు గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించారు. ఇండ్లకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కల్పించిన వసతులను వాకబు చేశారు. విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ వంటి మౌళిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ, గ్రామస్తుల వినతి మేరకు కేటాయింపు పూర్తి అవగా మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అర్హులకు అందిస్తామన్నారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. సొంత స్థలాలు ఉన్న ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ ను పరిశీలించారు. రైతులంతా ఫామ్ పాండ్ ల నిర్మాణాలకు ముందుకు రావాలని అన్నారు ఈ కార్యక్రమాలలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఎంపీడీఓ సుధాకర్, సర్పంచ్ దుమాల రాజు, ఉప సర్పంచ్ రఘు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు.జగిత్యాలలో త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం



జగిత్యాల అమృత్ తెలంగాణ జూలై 28 : జగిత్యాల పట్టణంలోని యవర్ రోడ్డులో సోమవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. దాదాపు 20 మంది విద్యార్థులతో పాఠశాలకు వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సును ఎదురుగా వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు పాఠశాల బస్సు స్వల్పంగా దెబ్బతినగా, అదృష్టవశాత్తూ విద్యార్థులకు ఎలాంటి తీవ్ర గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన అనంతరం విద్యార్థులు భయాందోళనకు గురికాగా, సమాచారం అందుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పిల్లలను సురక్షితంగా చూసి ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ఆరోపిస్తున్నారు. ప్రమాదం కారణంగా కొంతసేపు యవర్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# మైనారిటీ గురుకులాల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాఠశాలల అకడమిక్ పురోగతి, ప్రవేశాలు, పరీక్షల ఫలితాలు, భోజన నాణ్యత, మౌలిక సదుపాయాలపై సమగ్రంగా సమీక్షించారు. పాఠశాలల ప్రిన్సిపాళ్లు వివరించిన సమస్యలను పరిశీలించిన కలెక్టర్, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గర్ల్స్–1 పాఠశాలలో ఫర్నిచర్, తాగునీటి సమస్యలు పరిష్కరించడం, బౌండరీ వాల్‌కు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, గర్ల్స్–2 పాఠశాలలో కంప్యూటర్ ఉపాధ్యాయుల కొరత దృష్ట్యా రెగ్యులర్ టీచర్లకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వాలని సూచించారు

. ఇచ్చోడ, ఉట్నూర్, బంగారుగూడ మైనారిటీ పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు, మరుగుదొడ్లు, బౌండరీ వాల్లు, రహదారులు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా వంటి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాయ్స్–1 పాఠశాలలో పెయింటింగ్, మరమ్మతులు, మరుగుదొడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు విద్యార్థుల అకడమిక్ ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన బోధనతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వారం డీఎండబ్ల్యూ, ఆర్ఎల్‌సీ, విజిలెన్స్, అకడమిక్ కోఆర్డినేటర్‌లతో కూడిన సంయుక్త బృందం ఒక పాఠశాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని, నెలకు ఒకసారి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్ చిత్రు, మైనారిటీ గురుకులాలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, ఆర్ఎల్‌సీ, విజిలెన్స్, డీఎండబ్ల్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఝరి గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



అమృత్ తెలంగాణ కొమురం భీమ్ న్యూస్ కెరమెరి: కెరమెరి మండలం ఝరి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు,బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, పార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆత్రం సుగుణక్క సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేసి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుజాయిత్ ఖాన్,ఇందిరా ఫెల్లోషిప్ జిల్లా కోఆర్డినేటర్ కొవ ఇందిర,యూత్ కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు కమల్ నాథ్ రెడ్డి, నియోజకవర్గం కోఆర్డినేటర్ ఎలగల సాయి కుమార్, మొహమ్మద్, అయుబ్ ఖాన్,గిడ్డప్ప, పెందోర్ బిల్లు,దీూ కోవ బాధిరావు,దీూ లు మీరాబాయి, సావిత్రిబాయి, పద్మక్క ,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం





నాగర్ కర్నూల్:అమృత్ తెలంగాణ జూలై 28: రాష్ట్రంలోని గురుకులవిద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం,పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మున్ననూరు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, వసతి, తాగునీరు, ఇతర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో స్వయంగా అడిగి తెలుసుకుంటూ వారి అభిప్రాయాలను శ్రద్ధగా విన్నారు.అనంతరం విద్యాలయంలోని వంటశాల (కిచెన్), డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్, తాగునీటి సౌకర్యాలు, పరిసర ప్రాంతాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని చోట్ల అపరిశుభ్ర వాతావరణం కనిపించడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, పరిశుభ్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు చేశారు.అక్కడికక్కడే జాయింట్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) దేవసహాయంకు మంత్రి ఆదేశాలు జారీ చేస్తూ, డైనింగ్ హాల్‌కు సంబంధించిన మరమ్మత్తులు, తాగునీటి సమస్యలు, ఇతర చిన్నచిన్న లోపాలను అత్యవసరంగా పరిష్కరించాలని సూచించారు. సాయంత్రం కల్లా అన్ని సమస్యలను పరిష్కరించి, తీసుకున్న చర్యలపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతి కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీలో జిల్లా అధికారులు, గురుకుల విద్యాసంస్థల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ చొరవతో బడి బయట ఇద్దరు చిన్నారులకు విద్యాభాగ్యం

**ఇంద్రవెల్లిలో బాల కార్మికత్వానికి చెక్.. వెంటనే స్పందించి పాఠశాలలో చేర్పించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో బడి బయట ఒక్క చిన్నారి కూడా ఉండకుండా ప్రతి బాలబాలికకు విద్య అందేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టంగా చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం ఇంద్రవెల్లి మండల పర్యటన సందర్భంగా బడి బయట ఉన్న ఇద్దరు చిన్నారులను గుర్తించిన కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించడంతో వారికి విద్యాభాగ్యం కలిగింది. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని సాయినగర్‌లో నివసిస్తున్న కమరే మల్లేష్ పవార్ కుటుంబానికి చెందిన నలుగురు పిల్లల్లో ఇద్దరు మాత్రమే పాఠశాలకు వెళుతుండగా, మరో ఇద్దరు చిన్నారులు తండ్రితో కలిసి వృత్తి పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు జిల్లా కలెక్టర్ గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని జిల్లా సంక్షేమ అధికారి మిల్కాకు తెలియజేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ అధికారులు కుటుంబాన్ని కలిసి తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యతను వివరించారు. అనంతరం చిన్నారులు సునీతను ఇంద్రవెల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతిలో, సునీల్ ను ఎంపీపీఎస్ ఇంద్రవెల్లిలో 5వ తరగతిలో ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఒక్క బాల కార్మికుడు, ఒక్క బడి బయట పిల్లవాడు ఉండకూడదనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ప్రతి చిన్నారికి విద్యను అభ్యసించే హక్కు ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అలాగే ఎక్కడైనా బడి బయట పిల్లలు లేదా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్--1098కు సమాచారం అందించి వారి విద్యాభ్యాసానికి, బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళ పై కేసు నమోదు

**-తల్లిదండ్రులకు తెలియకుండా రూయ్యడి నుండి ఆదిలాబాద్ కు తీసుకువచ్చి బస్టాండ్ లో చిన్నారిని ఇతరులకు అప్పగించిన మహిళ.**

**-బాధితుల ఫిర్యాదు మేరకు తలమడుగు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.**

**-చిన్నారి ఆత్రం గంగామణి ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతి : ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ తలమడుగు మండలం రూయ్యడి గ్రామానికి చెందిన నిందితురాలు నైతం నాగు బాయి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు రూయ్యడి గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆత్రం గంగామణి ని తన కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆదిలాబాద్ పట్టణానికి తీసుకువచ్చి పట్టణంలో బస్టాండ్ వద్ద ఇతరులకు అప్పగించింది. ఈ ఘటనలో తల్లిదండ్రులకు తెలిసిన వెంటనే చిన్నారి కోసం వెతికి, తల్లి ఆత్రం కష్లి బాయి తలమడుగు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా నిందితురాలుపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. వెంటనే రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్ఐ డి రాధిక, రూరల్ ఎస్ఐ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో 3 బృందం లతో, దర్యాప్తు ను, తనిఖీలను ప్రారంభించడం జరిగిందని, సోమవారం మధ్యానం 2:30 గంటలకు నిందితురాలు సంచరించిన ఆదిలాబాద్ బస్టాండ్ మరియు తాంసి బస్టాండ్ ఏరియాలలో సీసీటీవీ కెమెరాలను విశ్లేషించగా, మహిళా చిన్నారి తో ఉన్నట్టు, సంచరించినట్టు తెలిపారు. చిన్నారి ఆత్రం గంగామణికి నాలుగు సంవత్సరాల వయస్సు ఉంటుందని, తనకు కోలాం భాష,కొద్దిగా తెలుగు వస్తాయని, తన ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతిని అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఆచూకీ తెలిసిన వారు తెలియజేయవలసిన నంబర్లు

తలమడుగు ఎస్ఐ - 8712659928

ఆదిలాబాద్ రూరల్ సీఐ - 8712659915

ఆదిలాబాద్ డిఎస్పి - 8712659914




అదిలాబాద్ జిల్లా డిఎస్పి జీవన్ రెడ్డి

అని తెలిపారు.

బాలికను గుర్తించి వెంటనే తల్లిదండ్రులకు లేదా దగ్గరలో ఉన్న పోలీసులకు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలని ఆదిలాబాద్ డిఎస్పి సూచించారు.

# నందన్ లో మొక్కల పంపిణి

**మొక్కల పెంపకంలో గ్రామం జిల్లాలో ఆదర్శంగా నిలవాలి సర్పంచ్ కూన హేమలత మహేష్**




నందన్ లో మొక్కలు పంపిణి చేస్తున్న సర్పంచ్ కూన హేమలత మహేష్

నిర్మల్ జిల్లా జులై 28 అమృత్ తెలంగాణ నర్సాపూర్ మండలం నందన్, గ్రామంలో పచ్చదనం పెంచలన్న ప్రభుత్వ ఆశయం లో భాగంగా మంగళవారం రోజు నందన్ గ్రామంలో ఇంటిఇంటికి మొక్కలను పంపిణీ చేసిన సర్పంచ్ కూన హేమలత మహేష్,వారు మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల గ్రామంలో పచ్చదనం వేళ్ళు విరుస్తుందని పుష్కళంగా వర్షాలు కూరవాలంటే పచ్చని చెట్లతో ప్రకృతి అందాలతో గ్రామాలను తీర్చి దిద్దడం మనందరి బాధ్యత అనీ వచ్చే తరానికి కానుకగా మహా వృక్షలను అందించాలని అన్నారు కార్యక్రమం లో ఫీల్డ్ అసిస్టెంట్ భూమేష్, సెక్రటరీ వెంకటేష్, గంగన్న, వెంకటరమణ, సాహెబ్ రావు, జాకీర్ హరీష్,ప్రీతూ, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థిక లబ్ది పొందాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వరి సాగు కష్టతరమైన నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థికంగా లబ్ది పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందని, రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. వరి సాగు మినహా పంట రకాన్ని ఎంచుకోవాలని, తక్కువ నీటి అవసరం గల పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. ఈ క్రమంలో రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు అందించడం జరుగుతుందని, రైతులు తమ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు, విత్తనాలు పొందాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వంటశాలను పరిశీలించి ఆహారం తయారీ సమయంలో వంట సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తాండూర్ మండలం ద్వారకాపురం గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ జ్యోత్స్న, ల్యాండ్ సర్వే ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తు భూ లావాదేవీలకు సంబంధించి మ్యాపు లో మార్పులు తప్పనిసరిగా నవీకరించడం జరుగుతుందని, గ్రామంలో దాదాపు 90 శాతం భూములకు శాశ్వత పరిష్కారం జరిగిందని, మిగిలిన భూమి న్యాయస్థానంలో కొనసాగుతున్న వివాదాల తీర్పు అనంతరం పరిష్కారం అవుతుందని తెలిపారు. రీ సర్వే అనంతరం అసలైన అర్హుల పేరిట భూ రికార్డులు ఉంటాయని, నక్షా పకడ్బందీగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం తాండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి అంజయ్య, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి సుష్మ లతో కలిసి రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. రైతులు ప్రభుత్వ సూచనల ప్రకారం పంట సాగు చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మావల రైతు వేదికలో ఘనంగా 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ మరియు సీడ్ మేళా : పాల్గొన్న ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సీడ్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సమావేశానికి హాజరైన రైతులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మావల రైతు వేదికలో 'రైతు నేస్తం' వంద ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఈనిర్వహించారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాతావరణంలో ఎల్నినో (El Nino) ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదైన మావల మండలంలో రైతు వేదికలో సీడ్ మేళా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కేడీడీ PR4-176 రకం 4 కిలోల ప్యాకెట్ రూ. 520 ధరకే రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని, అలాగే ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ మేళాలోని సీడ్ మేళాను మావల మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, బట్టిసావర్గావ్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, KVK శాస్త్రవేత్త వర్మ, మండల వ్యవసాయ అధికారి (MAO) అష్రాఫ్, ఏఇవో రమేష్, హెచ్ఈవో శైలజ, ఏడీఏ FTC శ్రీనివాస రావు, ఏవో STL సంధ్యారాణి, ఏవో FTC అరుణ, హెచ్ఈవో గణేష్, సతీష్, మరియు ఆయిల్ ఫామ్ రైతు రాం రెడ్డి, కేశవ్‌రెడ్డి, సందీప్, నర్సిములు, అక్షయ్, నాగన్న తదితర మండల రైతులు పాల్గొన్నారు.

# హత్య కేసు నిందితుది అరెస్ట్.....

మిస్సింగ్ కేసును ఛేదించి హత్య కేసు నిందితుడిని అరెస్ట్ చేసిన నర్సాపూర్ జి పోలీసులు........

జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు శాస్త్రీయ దర్యాప్తుతో కేసు ఛేదన.........



నిందితుడు వద్ద స్వాధీనం చేసుకున్న బైక్




ప్రెస్ మీట్ లొ మాట్లాడుతున్న పోలీసులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జులై 28 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉన్న నర్సాపూర్ పోలీసులు మిస్సింగ్ కేసును శాస్త్రీయ ఆధారాలతో లోతుగా దర్యాప్తు చేసి,దాని వెనుక ఉన్న హత్యను ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.

నర్సాపూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన పంచగూడ సాయి తేజ (26) తేది గత 15 పదిరోజుల క్రితం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో, మరుసటి రోజు అతని తల్లి నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై నర్సాపూర్ ఎస్ఐ గణేష్, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కేసు వివరాలు

దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో 20.07.2026న నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ ఒడ్డున సాయి తేజ మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభించింది. దీంతో మిస్సింగ్ కేసును అనుమానాస్పద మృతి కేసుగా మార్చి అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక ఆధారాలు, మొబైల్ కాల్ డేటా, సీసీటీవీ ఫుటేజీలు, విశ్వసనీయ సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు, మృతుడు చివరిసారిగా దర్యాపూర్ గ్రామానికి చెందిన రాయరం రాజశేఖర్తో కలిసి వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం అతడిని గుర్తించి విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు.

హత్య జరిగిన తీరు

తేది 16.07.2026న తన బైక్ సర్వీసింగ్ కోసం నిర్మల్‌కు వెళ్తున్నానని చెప్పి తన స్నేహితుడు సాయి తేజను వెంట తీసుకెళ్లిన రాజశేఖర్, మార్గమధ్యంలో మద్యం సేవించారు. అనంతరం గంజాల్ టోల్ ప్లాజా దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో సాయి తేజకు తీవ్ర గాయాలయ్యాయి.

ముందుగా ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్ లేదా నిజామాబాద్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో ప్రమాదం గురించి పోలీసులకు చెబుతానని సాయి తేజ చెప్పడంతో, ప్రమాదానికి తానే బాధ్యుడిగా చిక్కిపోతాననే భయంతో రాజశేఖర్, ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ వరద కాలువ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, అప్పటికే గాయాలతో ఉన్న సాయి తేజ తలపై బండరాయితో బలంగా కొట్టి హత్య చేసి, మృతదేహాన్ని కాలువ ఒడ్డున పడవేసి పరారయ్యాడు. అని మిస్సింగ్ కేసును సేదించిన పోలీసులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో డీస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# రేవంతన్న మాట తప్పని నేత

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు రూ. 2,278 కోట్ల నిధుల విడుదలపై సీఎంకు బోథ్ ఇంచార్జ్ ఆడే గజేందర్ కృతజ్ఞతలు

ఇంద్రవెల్లి సాక్షిగా ఇచ్చిన 'దత్తత' మాటను నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి

ఉత్తర తెలంగాణ రవాణా, ఆర్థిక రంగాన్ని మార్చే గేమ్ చేంజర్ ప్రాజెక్ట్

సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి, కమిట్‌మెంట్‌కు ఇది నిదర్శనం: ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ "ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు ఏది చెబితే అది చేస్తారని, ఆదిలాబాద్ జిల్లా ప్రగతిపై ఆయనకున్న అంకితభావానికి ఎయిర్‌పోర్టు నిధుల విడుదలే సజీవ సాక్ష్యం" అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఇంద్రవెల్లి సభలో 'ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటా' అని రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన మాటను అక్షరాలా నిలబెట్టుకుంటూ, ఉమ్మడి జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన ఆదిలాబాద్ (ఎయిర్‌పోర్ట్) భూసేకరణ, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం ఏకంగా రూ. 2,278.14 కోట్ల నిధులను మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడంపై ఆయన ఒక ప్రకటనలో ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ మాట్లాడుతూ.. గత పాలకులు ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే సీఎం రేవంత్ రెడ్డి గారు ఈ ప్రాంత ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారని గుర్తుచేశారు. మొత్తం 2,000 పై ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ అంతర్జాతీయ స్థాయి ఎయిర్‌పోర్ట్ ఉత్తర తెలంగాణ రూపురేఖలను మార్చేయబోతోందని ఆడే గజేందర్ పేర్కొన్నారు. దీనివల్ల ఈ ప్రాంతంలో వేలాది మంది స్థానిక గిరిజన, వెనుకబడిన యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మాటకు కట్టుబడే నైజం: "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని, రాజకీయ నిబద్ధతను వేలెత్తి చూపే సాహసం ఎవరూ చేయలేరు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు" అని ఆడే గజేందర్ స్పష్టం చేశారు. డిసెంబర్ 31, 2026 నాటికి భూసేకరణ, విద్యుత్ లైన్ల బదిలీ వంటి మౌలిక పనులన్నీ పూర్తి చేసి, 2028 జూన్ నాటికి విమానాల రాకపోకలు ప్రారంభించేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తాజా అధికారిక సమాచారాన్ని వెల్లడించారు. ఆదిలాబాద్‌ను విమానయాన పటంలో చేర్చేందుకు ఇంతటి భారీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, భగీరథ ప్రయత్నంల నిరంతరం కేంద్ర మంత్రులతో భేటికి ఆయన పడ్డ శ్రమ) ఇందుకు సహకరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి, ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కి బోథ్ నియోజకవర్గ ప్రజల తరఫున ఆడే గజేందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# భూగర్భ జలాల పెరుగుదలకు కృషి చేయాలి : మండల స్పెషల్ ఆఫీసర్ బి.వేణుగోపాల్

అమృత్ తెలంగాణ : భూగర్భ జలాల పెరుగుదలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ భీమనపల్లి వేణుగోపాల్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచులకు,గ్రామస్థాయి అధికారులకు,సిబ్బందికి,వి బి జి రామ్ జి పథకం కింద చేపట్టబోయే "జలసిరి" కార్యక్రమం పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.గ్రామాలలో నీటి సాంద్రతను పెంచేందుకు ప్రతి ఒక్కరు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత,ప్రతి పొలానికి పంట కుంట,ప్రతి ఊరికి ఊట కుంట అనే నినాదంతో పనిచేయాలని సూచించారు. మునుగోడు ప్రాంతంలో ఫ్లోరిన్ అధికంగా ఉన్నదని,భూమి లోతుకు వెళ్లే కొలది ఫ్లోరిన్ అధికంగా ఉంటుందని,ఇక భూమి లోతుకు బోర్లు వేయటం వలన ఆ వాటర్ లో ఫ్లోరిన్ అధికంగా కలిసి ఆ నీటితో పండించే పంటలో అధిక శాతం ఫ్లోరిన్ ఉంటుందని వివరించారు.కేవలం మిషన్ భగీరథ వాటర్ ద్వారా ఫ్లోరిన్ తగ్గుముఖం పట్టదని,పంటలకు ఉపయోగపడే సాగునీటిలో కూడా ఫ్లోరింగ్ లేకుండా చూసుకోవాలని అందుకు ప్రత్యామ్నాయంగా వర్షపు నీటిని వృధా చేయకుండా భూగర్భజలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలను,పంట కుంటలను,ఊట కుంటలను ఏర్పాటు చేసుకొని ఫ్లోరిన్ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. అంతకుముందు ఏపీవో జయరాజు ప్రభుత్వం వి బి జి రామ్ జి పథకం కింద చేపట్టబోయే "జలసిరి" కార్యక్రమం,పనుల గురించి క్షుణ్ణంగా వివరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో జిసి మున్నయ్య,ఎంపీఓ రవికుమార్,ఏపీఎం అద్దంకి వెంకట్,ఏఈ గ్రిడ్ వెంకటేష్,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్,ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు,ఉపాధిహామీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# న్యూజెర్సీలో ఘోర రోడ్డు ప్రమాదం..రంగారెడ్డి జిల్లా వాసి మృతి



అమృత్ తెలంగాణ : అమెరికాలోని న్యూజెర్సీలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి

చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44) మృతి చెందారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అయిన దీపారెడ్డి, ఆమె భర్త రామకృష్ణారెడ్డి 20 ఏళ్ల క్రితం అమెరికాలో స్థిరపడ్డారు. దీపారెడ్డి కారు సిగ్నల్ వద్ద ఆగి ఉన్నప్పుడు, మరో కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# కపూర్ వెడ్డింగ్ లో మెరుపు తీగ జాన్వీ ఛమక్కు



పెళ్లిలో అందాల జాన్వీ కపూర్ మెరుపుతీగను తలపించింది. ఆకాశం నుంచి తార ఒకటి నేలకు దిగివచ్చిన చందంగా తళతళా మెరిసిపోయింది కపూర్ డాటర్. అనిల్ కపూర్ జుహు బంగ్లా శనివారం అంగరంగ వైభవమైన వెడ్డింగ్ కి వేదిక అయ్యింది.రియా కపూర్ -కరణ్ బూలాని వివాహ వేదిక వద్ద తారల తళుకుబెళుకులు ప్రధానంగా హైలైట్ అయ్యాయి. ఇక ఈ వేదికకే జాన్వీ కపూర్ షో స్టాపర్ గా నిలిచింది. సోదరి రియా కపూర్ వివాహ అతిథి-జాబితా చాలా పెద్దదే. ఈ వివాహానికి మనీష్ మల్హోత్రా పండుగ దుస్తుల్లో పూలరంగడిలా వచ్చారు. అనిల్ కపూర్ జుహు బంగ్లా శనివారం బ్యాండు మేళంతో అతిథుల రాకతో సందడిగా మారింది. అనిల్ కపూర్ ఇంటికి రాకముందే జాన్వీ ఇన్ స్టాగ్రామ్ లో తన లుక్ కి సంబంధించిన డీటెయిలింగ్ ని ఇచ్చింది.జాన్వీ తళతళా మెరుస్తున్న క్రిస్టలిన్ లెహెంగా ధరించి మెరుపుతీగలా వేదిక వద్దకు వచ్చింది. ఇక ఈ వేడుకలో కపూర్ కుటుంబ సభ్యులు మహీప్ కపూర్.. సంజయ్ కపూర్ .. జహాన్.. మహీప్ కుమార్తె షానయా కపూర్ తదితరులు విచ్చేశారు.ఈ వేదిక వద్ద జాన్వి సోదరి ఖుషీ కపూర్ షనయతో కలిసి సందడి చేసింది. జాన్వీ మరో సోదరి.. అర్జున్ సొంత సిస్టర్ అన్షులా కపూర్ ఎరుపు రంగు దుస్తుల్లో కనిపించింది. సోదరుడు అర్జున్ కపూర్ కజిన్ రియా వివాహంలో బిజీగా కనిపించాడు. నిర్మాత బోనీ కపూర్.. తెల్లటి దుస్తులు ధరించి పండగలా వచ్చారు. అనిల్ కపూర్ సోదరి రీనా కపూర్ తన భర్త సందీప్ మార్వాహ్ తో వచ్చారు. రీనా కపూర్ కుమారుడు మోహిత్ మార్వా కూడా వేదిక వద్ద కనిపించింది. నిర్మల్ కపూర్.. రియా కపూర్ అమ్మమ్మ కూడా వేడుకలకు హాజరయ్యారు.

# ఆంధ్రా చేపల పులుసుకి బ్రాండ్ అంబాసిడర్



మిల్కీబ్యూటీ తమన్నా సుదీర్ఘ ఇన్నింగ్స్ ని ఎంతో తెలివిగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. కథానాయికగా ఆఫర్లు తగ్గినా ఇప్పుడు తన కోసం డిజిటల్ వేదిక టీవీ మాధ్యమం కూడా అందుబాటులో ఉన్నాయి. దీపం ఉండగానే తెలివైన ఎత్తుగడలతో ప్లాన్ ని ఛేంజ్ చేస్తోంది. ఇప్పటికీ నవతరం కథానాయికలతో సైతం పోటీ పడి అవకాశాలు అందుకుంటోంది. టాలీవుడ్ లో తమన్నా కెరీర్ ఎంతో సుదీర్ఘమైనది. దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించింది. ఐటమ్ గాళ్ గాను భారీ పారితోషికం అందుకుని వచ్చిన అవకాశాల్ని వినియోగించుకుంది. పలు సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్ గా కొనసాగుతూ ఆర్జిస్తోంది. వీటికి అదనంగా రిబ్బన్ కటింగ్ లతోనూ ఆర్జించింది. ప్రస్తుతం టాలీవుడ్ కోలీవుడ్ లో అడపాదపా సినిమాలు చేస్తోంది. ఇతర భాషల్లోనూ నాయికగా కొనసాగుతోంది. ఇంతలోనే ఓ బుల్లితెర షోకు హోస్ట్ గాను బిజీ అవ్వబోతుంది. జెమినీ-తెలుగులో ప్రసారం కానున్న మాస్టర్ చెఫ్ షో కి హోస్ట్ గా వ్యవరిస్తుంది.రియాలిటీ షో ప్రమోషన్స్ లో భాగంగా ప్రతిరోజు ఒక కొత్త అప్ డేట్ తో అమ్మడు బుల్లి తెర ప్రేక్షకులకు టచ్ లో ఉంటోంది. తాజాగా పాక శాస్త్రంలో తన నైపుణ్యం గురించి చెప్పుకొచ్చింది. ఏదైనా టూర్లు వెళ్లినప్పుడు ఆ రాష్ట్రంలో స్థానికంగా ఉండే వంటల్ని ఎక్కువగా ఇష్టపడుతుందిట. ముఖ్యంగా ఆంధ్రా స్టైల్ రుచులు అదిరిపోతాయని..అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రా వంటలు అసాధారణమైన రుచిని కలిగి ఉంటాయని తెలిపింది. ఇక్కడ చేపల పులుసు అద్భుతంగా ఉందని తెలిపింది. అలాగే హైదరాబాద్ బిర్యానీ అన్నా అంతే ఇష్టమని నోరూరించింది. ముంబైలోని తన స్నేహితులకు హైదరాబాద్ నుంచి చాలాసార్లు బిర్యానీ పార్సిల్స్ పంపించినట్లు తెలిపింది.ఇక్కడి స్వీట్లు... ఆంధ్రా పూతరేకులు కూడా ఎక్కువగా ఇష్టపడతానంది. అయితే వంట చేయడం మాత్రం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నట్లు తెలిపింది. ఇంటికొచ్చిన తర్వాత కొత్త వంటకాల ప్రయోగాలు చేస్తానని అంది. వంట చేయడం ఇంట్లో అలవాటు చేయకపోవడం వల్ల ఇన్నాళ్లు నేర్చుకోలేకపోయానని.. అమ్మ వంట గదిలోకి వెళ్లనిచ్చేది కాదని తెలిపింది. ఇక ఇదే షోకు తమిళ్ లో విజయ్ సేతుపతి.. కన్నడలో సుదీప్.. మలయాళంలో పృథ్వీరాజ్ హోస్ట్ లుగా వ్యవరిస్తున్నారు. ఆ రకంగా ఇది జెమినీ టీవీలో పాన్ ఇండియా షోగా కీర్తికెక్కబోతోంది.

# బిబి అప్డేట్.. క్వారెంటైన్ మొదలయ్యింది

బిగ్ బాస్ సీజన్ 5 ఎప్పు డు స్టార్ట్ అవుతుందా? అని ప్రేక్షకులు ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే షోకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు నిర్వాహకులు.తెలుగులో ప్రసారమయ్యే ఈ రియాలిటీ షో ఆల్రెడీ స్టార్ట్ కావాల్సి ఉంది. కానీ కరోనా పరిస్థితుల నేపథ్యంలో షో పోస్ట్ పోన్ అవుతూ వచ్చింది.అయితే ఆగస్టు 14న సీజన్ 5 ప్రోమో రిలీజ్ అయింది. ప్రోమోలోనాగార్జున యాక్టివ్గా కనిపించారు. 'చెప్పండి బోర్ డమ్కు గుడ్ బై.. వచ్చేస్తుంది బిగ్ బాస్ సీజన్ 5' అని నాగార్జున తెలిపాడు. కాగా 'బిగ్ బాస్ సీజన్ ఫైవ్' కంటెస్టెంట్స్ క్వారంటైన్ అయినట్లు తెలుస్తోంది.కరోనా థర్డ్ వేవ్ నేపథ్యంలో వారు క్వారంటైన్ అయ్యాకనేషోలోపార్టిసిపేట్ చేయాలని సూచించారట నిర్వాహకులు. యాంకర్స్ సినీ నటులు బుల్లితెర నటులు సీనియర్ నటులు ఈ షోలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాగా 'సీజన్ ఫైవ్' సెలక్టెడ్ కంటెస్టెంట్స్ను ఈ నెల22న స్టార్‌హోటల్లో క్వారంటైన్కు వెళ్లబోతున్నట్లు సమాచారం.ఈ క్రమంలోనే వారికి వ్యాక్సిన్ కూడా ఇవ్వను న్నారట. కొవిడ్ పరిస్థితులు నార్మల్ అయ్యాక రియాలిటీ షోను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.సెప్టెంబర్ ఫస్ట్ వీక్లో ఈ రియాలిటీ షో ఎపిసోడ్స్ వైడ్గా టెలికాస్ట్ కానుంది. ఇక ఈ సీజన్కుటాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున హోస్టా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.






శివ్‌రానా హాట్ ఇన్ పింక్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com